క్లుప్తంగా

ఉపాధి కల్పనకు కృషి



బొండపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని బొండపల్లి, అంబటివలస గ్రామాలలో నిర్మాణాలు పూర్తయిన సచివాలయ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలోనే అన్ని సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బొండపల్లి, అంబటివలస సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరావు, పి. రాము, నాయకులు గోపాలరాజు, బాలాజీ, ఉప సర్పంచ్ కోళ్ల రమణ, ఎంపీటీసీ సభ్యుడు బి. శ్రీనివాస్, పాలూరి మురళి, అధికారులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



వేపాడలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

వేపాడ: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. చీపురుపల్లి వారి వీధిలో జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

డ్వాక్రా మహిళలతో సమావేశం



స్వయం సహాయక సభ్యులతో సమావేశమైన టీసీఎస్ బృంద ప్రతినిధులు, సభ్యులు

జామి: మండలంలోని అలమండ సంతలో డ్వాక్రా మహిళలు, వీఓఏలతో హైదరాబాద్‌కు చెందిన టీసీఎస్ ప్రతినిధులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జియో ఫెన్సింగ్, ఫేసియల్ రికగ్నిజేషన్, మొబైల్ బుక్ కీపింగ్, తదితర సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధులు భానుప్రియ, సాయిపద్మ, డీఆర్‌డీఏ డీపీఎం చిరంజీవి, స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చిట్టిబాబు, ఎల్‌హెచ్ ఏపీఎం పద్మ, ఏపీఎం అప్పలనాయుడు, సీసీలు చినబాబు, అప్పలనాయుడు, కృష్ణ, వీఏఎలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన



విద్యార్థులచే పదాలు, సంఖ్యలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని సోంపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



రైతుసేవా కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం రైతుసేవా కేంద్రంలో యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి శనివారం చోటుచేసుకుంది. పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాల్లోని రైతులకు ఎరువులు అందించాల్సి ఉండగా.. 134 బస్తాలు ఎటూ సరిపోలేదు. దీంతో బంగారమ్మపేటకు చెందిన కొద్దిమంది రైతులు అర బస్తా చొప్పున తీసుకున్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన



మాట్లాడుతున్న ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు

వేపాడ: తరగతి గదుల్లో విద్యార్థులకు సులభతరంగా బోధన అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక పాఠశాలలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎస్.కృష్ణస్వామి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గోడు పట్టదా..!

- అనర్హుల పేరిట అర్హులను తొలగిస్తున్న వైనం
- మండలంలో 359 మంది దివ్యాంగుల పింఛన్ల తొలగింపు
- మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు నేడే ఆఖరు : అధికారులు





దుందుర్తి శ్రీను దబ్బిరాజుపేట



నుడగల సన్నిబాబు, జాకేరు

వేపాడ: అధికారంలోకి వచ్చిన ఏడాదిలనే కూటమి సర్కారు దివ్యాంగులకు షాక్ ఇచ్చింది. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి రీ వెరిఫికేషన్ అంటూ ప్రభుత్వం దివ్యాంగులకు నోటీసులు పంపించడంతో పాటు ఎంతోమంది అర్హుల పింఛన్లు నిలిపేసింది. దీంతో దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో 757 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో 359 మందిని అనర్హులుగా గుర్తించి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయితే 60 ఏళ్లు నిండిన 70 మందిని వృద్ధాప్య పింఛన్‌కు మార్చారు. మిగిలిన 289 మంది ఈ నెల 31లోగా పాత, కొత్త సదరన్ సర్టిఫికెట్లతో మరోసారి అర్జీ పెట్టుకోవాలని అధికారులు సూచించారు. దీంతో అర్హులైన దివ్యాంగులు కూడా పింఛన్లు పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాకేరు గ్రామానికి చెందిన కోలా వీరన్నదొర పుట్టుకతోనే పోలియో బారిన పడి రెండు కాళ్లు పనిచేయని స్థితిలో ఉన్నాడు. రూ. 75 పింఛన్ ఉన్నప్పటి నుంచి పింఛన్ పొందుతున్న తనను ఇప్పుడెందుకు అనర్హుడునని అంటున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నాడు. అలాగే తమ పని తాము చేసుకోలేని ఎన్. సన్నిబాబు, సలాది నారాయణరావులను కూడా అనర్హులుగా గుర్తించారు. దబ్బిరాజుపేటలో దుందుర్తి శ్రీనుకు ఒక కాలు పూర్తిగా పనిచేయకపోవడంతో కర్ర సహాయంతో నడుస్తుంటాడు. గత ప్రభుత్వం హయాంలో వచ్చిన సదరమ్ సర్టిఫికెట్ ఈ ప్రభుత్వం హయాంలో ఎందుకు పనికి రావడం లేదోనని శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అనర్హుల ఏరివేత అని చెప్పి అర్హులకు మొండిచేయి చూపడం తగునా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవికుమార్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా.. అనర్హులుగా గుర్తించిన 359 దివ్యాంగ పింఛన్‌దారుల్లో 70 మందిని వృద్ధాప్య పింఛన్లకు మార్చామని చెప్పారు. మిగిలిన వారు కొత్త సదరమ్ సర్టిఫికెట్లతో ఆయా సచివాలయ పరిధిలో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతలుంటూ పింఛన్లను పునరుద్ధరిస్తామన్నారు.

పుట్టకతోనే...



పుట్టుకతోనే పోలియోతో బాధపడుతున్నాను. రెండు కాళ్లు చచ్చుకుపోయి ఏ పనీ చేయలేని పరిస్థితి. 75 రూపాయల నుంచి వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. సదరమ్ సర్టిఫికెట్ ఉన్నా అనర్హుడిగా గుర్తించారు. నాలాంటి వారికి ఇబ్బంది పెట్టడం తగదు.
– కోలా వీరన్నదొర, జాకేరు, వేపాడ మండలం

సచివాలయాల వారీగా తొలగించిన పింఛన్లు..

ఆతవలో 28, బల్లంకిలో 16, బానాదిలో 20, బొద్దాంలో 16, దబ్బిరాజుపేటలో 15, జాకేరులో 29, కొండగంగుబూడిలో 10, కుమ్మపల్లిలో 30, నీలకంఠరాజపురంలో 29, నల్లబిల్లిలో 25, పాటూరులో 39, రామస్వామిపేటలో 10, శింగరాయిలో 37, సోంపురంలో 4, వల్లంపూడిలో 12, వేపాడలో 24, వావిలపాడులో 5, వీలుపర్తిలో 10 పింఛన్లను తొలగించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మండలం బూత్ ఇన్‌చార్జ్‌లను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి బూత్ ఇన్‌చార్జ్‌లు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో కొత్తగా నియమితులైన బూత్ ఇన్‌చార్జ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ఇన్‌చార్జ్‌లపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బూత్ ఇన్‌చార్జ్‌లుగా గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు తాడ్డి చందులను నియమించగా.. పలువురు అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి

- డైట్ ఆంగ్ల ఉపాధ్యాయుడు అన్నారావు



కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న డైట్ లెక్చరర్ అన్నారావు

చీపురుపల్లి: గదుల్లో వినూత్న బోధన ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని డైట్ ఆంగ్ల ఉపాధ్యాయుడు కె. అన్నారావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సముదాయంలో శనివారం జరిగిన సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎంతో సృజనాత్మకత ఉందన్నారు. వారిలో ఉన్న సృజనాత్మకత వెలికి తీయాలంటే ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులు అవలంభించాలన్నారు. అనంతరం మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.రెహనాబేగం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇంటి పన్ను వసూలు

- పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ



సిబ్బందితో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

గజపతినగరం: పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరాలంటే ఇంటి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజ ఆదేశించారు. గజపతినగరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజపతినగరంలో ఎక్కువగా ఇంటి పన్ను బకాయిలున్నాయని చెప్పారు. గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు హక్కు కల్పించనున్న నేపథ్యంలో వాటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత, డీఎల్‌పీఓ శిరీషారాణి, సీఈఓ బి.సత్యనారాయణ, ఈఓపీఆర్‌డి సుగుణాకరరావు పాల్గొన్నారు.

పనులు చేపట్టాలి

చీపురుపల్లి: భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజ సూచించారు. పట్టణంలోని సచివాలయం–3 పై అంతస్తులో నిర్మాణంలో ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని అక్కడ అధికారులతో మాట్లాడారు. సచివాలయాల పనితీరు, భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పరిపాలనలో పారదర్శకత కోసం భవిష్యత్‌లో నూరు శాతం డిజిటలైజేషన్ అమల్లోకి రానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం ఆధ్వర్యంలో పలువురు సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కె.హేమసుందరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



వార్డెన్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: సంక్షేమ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలన్నీ కచ్చితంగా అందాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో గల ప్రభుత్వ సంక్షేమ వసతిగృహ అధికారులతో శనివారం సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం భోజనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. శీతాకాలంలో విద్యార్థులకు అవసరమైన దుప్పట్లను త్వరలోనే అందిస్తామని చెఆప్పరు. ఏఎస్‌డబ్ల్యూఓ కృష్ణ మాట్లాడుతూ.. ఎస్.కోట మండలం ధర్మవరం బీసీ బాలుర వసతిగృహంలో 42 సీట్లు, ఎస్.కోట బీసీ బాలుర వసతిగృహంలో 71 సీట్లు, కొత్తవలస బీసీ బాలికల హాస్టల్‌లో 39, ఎస్.కోట బీసీ కళాశాల హాస్టల్‌లో 30, ఎస్.కోట బీసీ బాలికల హాస్టల్‌లో 36 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు, కొత్తవలస డిప్యూటీ ఎంపీడీఓ శ్రీదేవి, పలు హాస్టల్స్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వేపాడ: కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకంతో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆటో కార్మికులు కోరారు. ఈ మేరకు మండలంలోని బల్లంకి, బానాది, భర్తవానిపాలెం, నీలకంఠరాజపురం, జమ్మాదేవిపేట, కేఆర్ పేట, కుమ్మపల్లి, తదితర గ్రామాలకు చెందిన ఆటో కార్మికులు ఆనందపురం జంక్షన్‌లో శనివారం నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సారిక ఈశ్వరరావు, రాజు నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడుతూ.. డిగ్రీలు, ఐటీఐలు చదువుకుని ఉద్యోగాలు లేక జీవనోపాధికి రూ.లక్షలు వెచ్చించి ఆటోలు కొనుక్కొని కుటుంబాలను నెట్టుకొస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

- ఆర్‌జేడీ ఆదినారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ ఆదినారాయణ

చీపురుపల్లి: విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ ఆర్‌జేడీ మజ్జి ఆదినారాయణ సూచించారు. పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో సదుపాయాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ఎంతో విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా చదువు కోసం మాత్రమే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సూర్యప్రభ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, నాయకులు

జామి: పేదల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నెయ్యిలవీధి జగనన్న కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ.. వీధి లైట్లు, సీసీ రోడ్లు, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గ కార్యదర్శి భీముడు, సహాయ కార్యదర్శి డేగల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మెరకముడిదాం: మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. దీంతో గ్రామానికి తాగునీటిని అందించే విద్యుత్ మోటార్‌కు సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అలాగే పలు గృహాలకు కూడా సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



గొట్టుపల్లిలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్

ఉపాధ్యాయుల ఔదార్యం

గజపతినగరం రూరల్: మండలంలోని పురిటిపెంట గ్రామ ప్రభుత్వ రెగ్యులర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఆర్.గౌరమ్మ, అప్పలనాయుడు తమ సొంత డబ్బులతో పాఠశాలకు రంగులు వేయిస్తున్నారు. అలాగే మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామస్తులు ఉపాధ్యాయులను అభినందించారు.

ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ



గణనాథుని మంటపం వద్ద నిర్వహించిన దీపాలంకరణ

వేపాడ: మండలంలోని వల్లంపూడి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మంటపం వద్ద శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు స్వస్తిక్, ఓంకారం, శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించారు. అంతకుముందు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్య వివాహాలు నేరం



సాలిపేటలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

గజపతినగరం రూరల్: బాల్య వివాహాలు నేరమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు కె. అప్పలరాజు అన్నారు. మండలంలోని సాలిపేటలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలన్నారు. అలాగే అట్రాసిటీ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. కాలాన్ని వృథా చేసుకోకుండా రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయనతో పాటు కమిటీ సభ్యులు పి.ఆదినారాయణ, ఆర్‌పి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

హర్షితకు నీట్ పీజీలో సీటు



శృంగవరపుకోట: ఎస్.కోటకు చెందిన హర్షత నీట్ పీజీలో సీటు సాధించింది. ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన హర్షిత హౌస్ సర్జన్ పూర్తి కాగానే తొలి ప్రయత్నంలోనే పీజీలో సీటు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో 6327 ర్యాంక్ సాధించింది.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి కేజీబీవీ విద్యార్థిని జాతీయ పతకం సాధించింది. కేజీబీవీకి చెందిన కుమ్మరి అశ్విని సెపక్‌తక్రా క్రీడలో జాతీయ స్థాయిలో నేషనల్ మెడల్ సాధించినందుకు గాను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఇటీవల మంత్రి లోకేష్, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ సన్మానించారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, పీఈటీ భవానీ, తదితరులు అశ్వినిని శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

35 మంది రక్తదానం

దత్తిరాజేరు: మండలంలోని సరయ్యవలస, పోరలి గ్రామాల్లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో 35 మంది రక్తదానం చేశారు. విజయనగరానికి చెందిన ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ వైద్యుడు శశాంక్, తదితరులు రక్తం సేకరించారని నిర్వాహకుడు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు.

రిజర్వేషన్లు పాటించాలి

చీపురుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. దళిత వర్గాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమే తప్ప.. రాజ్యాంగం కల్పించిన హక్కులు కల్పించడం లేదన్నారు. మండలంలోని రావివలస పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి దాదాపు ఐదు దశాబ్దాలుగా సర్పంచ్ స్థానం ఎస్సీ వర్గానికి కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎన్నికల కమిషన్ స్పందించి నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న రహీం షేక్‌లాల్ సొంత డబ్బులతో గుర్తింపు కార్డులు తయారు చేసి శనివారం అందజేశారు. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకున్న 130 మంది విద్యార్థులకు హెచ్‌ఎం పీవీ రామ్‌కుమార్ చేతులమీదుగా కార్డులు పంపిణీ చేశారు.

సంతగైరమ్మపేటలో న్యాయ అవగాహన సదస్సు

శృంగవరపుకోట: సంతగైరమ్మపేటలో మండలం న్యాయ సేవా కమిటీ శృంగవరపుకోట, మండల రెవెన్యూ కార్యాలం సంయుక్తంగా న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది టీవీ రమణమూర్తి మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులము, షెడ్యూల్డ్ తెగల వారికి ఎటువంటి సమస్యలున్నా రాతపూర్వకంగా తెలియజేస్తే న్యాయ సహాయం అందజేస్తామన్నారు. సీనియర్ న్యాయవాది బి. సత్యనారాయణ మాట్లాడుతూ.. న్యాయసేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు.